సాక్షి
చిత్తూరు
గురువారం । 7 । నవంబర్ । 2024



వరసిద్ధునికే టెం'డర్'

కాణిపాకం ఆలయానికి ఆదాయాన్ని సమకూర్చే టెండర్లను తన్నుకుపోవడానికి అధికార పార్టీ ప్రయత్నిస్తోంది. - 10లో



కత్తిసాముకు ఐరాల విద్యార్థులు

రాష్ట్ర స్థాయి కత్తిసాము పోటీలకు ఐరాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం విజయలక్ష్మి తెలిపారు. - 10లో



పశువులకు మెరుగైన వైద్యం

పశువులకు మెరుగైన వైద్యం అందించాలని పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. - 10లో

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వి.కోటలో విద్యుత్ ఉపకేంద్రాన్ని వర్చువల్ విధానంలో సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్చువల్ కార్యక్రమానికి తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఏపీ ట్రాన్స్ కో అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ ప్రసాదరావు, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, ఎంఎల్‌సీలు పాల్గొంటారని తెలిపారు.

విద్యుత్ గ్రీవెన్స్‌కు 5 ఫిర్యాదులు



వినియోగదారుడితో మాట్లాడుతున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమానికి మొత్తం 5 ఫిర్యాదులు వచ్చాయని ఈఈ మునిచంద్ర తెలిపారు. గాంధీరోడ్డులోని ఈఈ కార్యాలయంలో వినియోగదారుల నుంచి వినతులను స్వీకరించి మాట్లాడారు. డివిజన్ పరిధిలో కరెంటు స్తంభం ఏర్పాటు, కేటగిరి మార్పు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ తగ్గించాలి, కరెంటు మీటర్ మార్పుతో సహా మొత్తం 5 ఫిర్యాదులు అందిందన్నారు. ఇందులో కోర్టు ఆర్డర్ ప్రకారం ఎలక్ట్రిసిటీ డ్యూటీ తగ్గింపునకు చర్యలు తీసుకున్నమన్నారు. వీటితో పాటు మీటర్ మార్పునకు స్థానికంగా లైన్‌మన్‌ను పరిశీలించాలని ఆదేశించామన్నారు. మిగిలిన వాటిని పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో డీఈ ప్రసాద్ తదితరుల పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్వోగా థామస్

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు వెస్ట్ ఎఫ్ఆర్వో బాలకృష్ణారెడ్డి నెల రోజులు మెడికల్ లీవ్‌పెట్టారు. దీంతో అదనపు బాధ్యతలను ఈస్ట్ ఎఫ్ఆర్వో థామస్‌కు అందిస్తూ కన్జర్వేటర్ యశోద బాయి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం థామస్ చార్జ్ తీసుకున్నారు. సిబ్బందితో పలు అంశాలపై మాట్లాడారు.

తాళాలు తెరిచారు



తెరుచుకున్న ఉర్దూ డీఐ శాఖ కార్యాలయం తలుపులు

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు కలెక్టరేట్ : డీఈఓ కార్యాలయంలోని ఉర్దూ డీఐ శాఖ కార్యాలయం బుధవారం తెరిచారు. ఈ నెల 6వ తేదీన సాక్షి దినపత్రికలో బాధ్యతలు చేపట్టి విధులకు గైర్హాజరు అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన ఉర్దూ డీఐ అఫ్సర్ ఖాన్ బుధవారం తన విధులకు హాజరయ్యారు. డీఐ మాట్లాడుతూ తాను ఇటీవలే ఉర్దూ డీఐగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. రామకుప్పం మండలంలో హెచ్‌ఎంగా సైతం తాను పనిచేస్తున్నట్లు చెప్పారు. తనకిచ్చిన ఉర్దూ డీఐ బాధ్యతలను కచ్చితంగా నిర్వర్తించి ఉర్దూ బడుల బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

సమస్యలు చెప్పండి ఇలా..



ఫిర్యాదుల పెట్టె

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవర సిద్ధి వినాయకస్వామి దర్శనార్థం దేశవ్యాప్తంగా నిత్యం వేలాది మంది భక్తులు దర్శించుకుంటారు. ఇలాంటప్పుడు చాలా మందికి సమస్యలు ఎదురవుతుంటాయి. ప్రధానంగా దర్శనంలో ఆలస్యం కావడం, ఆలయ సిబ్బంది దురుసుగా ప్రవర్తించడం వంటి సమస్యలతో ఇబ్బందిపడుతుంటారు. ఇక పలు రకాల సమస్యలు వారి కంట పడుతుంటాయి. కానీ ఎవరికి చెప్పుకోవాలో తెలియ సతమతమవుతుంటారు. ఇలాంటి తరుణంలో ఆలయ అధికారులు ఫిర్యాదుల బాక్సును ఏర్పాటు చేశారు. ఇకపై సమస్యలను రాత పూర్వకంగా రాసి బాక్సులో వేయవచ్చని అధికారులు పేర్కొన్నారు.

మ్యూజియం.. పూర్వ వైభవం

సైన్స్ అంటే భయపడాల్సిన అవసరం లేదు. ప్రయోగాలతో సులభంగా అర్థమయ్యేలా పాఠాలు నేర్పేందుకు జిల్లా విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో పదేళ్ల క్రితం మూతపడిన సైన్సు మ్యూజియానికి పూర్వ వైభవం తీసుకురానుంది. జిల్లా కేంద్రంలోని రిజర్వ్ ఫారెస్టు వద్ద ఉన్న జిల్లా సైన్సు మ్యూజియం సుందరీకరణ పనులకు రూ.20 లక్షలు వెచ్చిస్తోంది. త్వరలో ఆ సైన్సు మ్యూజియం ప్రారంభించి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ప్రయోగాలతో కూడిన పాఠాలు బోధించేందుకు కసరత్తు మొదలుపెట్టింది. త్వరలో జిల్లా సైన్సు మ్యూజియం ప్రారంభించేందుకు వేగవంతంగా పనులు చేపడుతోంది. సైన్సు మ్యూజియం సుందరీకరణ, విద్యార్థులకు కలిగే ఉపయోగాలపై 'సాక్షి' కథనం





- ప్రయోగాలతో పాఠాలు నేర్పేందుకు అధికారుల చర్యలు
- రూ.20 లక్షలతో జిల్లా సైన్సు మ్యూజియం సుందరీకరణ పనులు
- సైన్స్‌పై భయాన్ని పోగొట్టేందుకు వినూత్న ప్రయత్నం
- త్వరలో ప్రారంభానికి సన్నాహాలు

చిత్తూరు కలెక్టరేట్ : పది సార్లు చదివేకంటే ఒకసారి చూస్తే ఎక్కువ అర్థం అవుతుంది. ఇక కొన్ని సైన్స్ ప్రయోగాలను అర్థం చేసుకునేందుకు ఎన్ని సార్లు చదివినా అర్థం కావు. కానీ వాటిని కళ్లకు కట్టినట్టు చూపిస్తే అందులోని అంశాలను విద్యార్థులు తమ మెదడులో సులభంగా నిక్షిప్తం చేసుకుంటారు. విద్యార్థులకు సైన్స్ పట్ల భయం పోగొట్టి ప్రయోగాల పట్ల ఆసక్తి పెంచేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లా కేంద్రంలో సైన్సు మ్యూజియంను 2009లో అప్పటి కలెక్టర్ ముద్దాడ రవిచంద్ర ప్రత్యేక చొరవతో ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో సైన్సు మ్యూజియం ఉంటే వేలాది మంది విద్యార్థులకు ఉపయోగపడుతుందని భావించి నెలకొల్పారు. ఈ మ్యూజియంలో గణితం, ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్, కెమిస్ట్రీలకు సంబంధించి ప్రత్యేక ఇన్నోవేషన్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు తమ సిలబస్‌లో ఉన్న ప్రయోగాలను మ్యూజియంలో వచ్చి నేరుగా చేసే విధంగా వెసులుబాటు కల్పించారు. మ్యూజియంలో ప్రయోగాలు చేయడం వల్ల విద్యార్థుల్లో కొత్త కొత్త ప్రాజెక్టులు చేయాలనే ఉత్సాహం కలుగుతుందని విద్యాశాఖ అధికారుల అభిప్రాయం.

58 ప్రయోగాలు చేసుకోవచ్చు

జిల్లా సైన్సు మ్యూజియంలో 58 ప్రయోగాల నిర్వహణకు కసరత్తు చేస్తున్నారు. భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, అంతరిక్షం, గణితం, ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించిన ప్రయోగాలను ఏర్పాటు చేయనున్నారు. దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలో విద్యార్థులకు సైన్స్ మ్యూజియంలు ఉన్నా... అందులో గణిత విభాగం అరుదుగా ఉంటుంది. అయితే జిల్లా కేంద్రంలోని సైన్సు మ్యూజియంలో పది గణిత ప్రయోగాలతో వంద సిద్ధాంతాలను వివరించేలా ప్రత్యేకంగా గణిత విభాగం ఏర్పాటు చేస్తున్నారు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లో వచ్చే మొక్కలతో బొటానికల్ గార్డెన్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నారు. మ్యూజియంను సందర్శించిన తర్వాత విద్యార్థులు సైన్స్‌కు సంబంధించిన వీడియోలు చూసేందుకు ప్రత్యేకంగా మినీ థియేటర్‌ను ఏర్పాటు చేయనున్నారు.

సైన్స్ అంటే భయం పెరుగుతోంది

విద్యార్థులు సైన్స్ సబ్జెక్ట్ అంటే రోజు రోజుకూ భయం పెరుగుతోందని విద్యావేత్తలు చెబుతున్నారు. సైన్సులోని సిద్ధాంతాలు, ప్రయోగాలు అర్థంకాకుండా విద్యార్థులు సైన్సుపై ఆసక్తి చూపించడం లేదు. ఈ సమస్యను గుర్తించిన జిల్లా విద్యాశాఖ అధికారులు సైన్సు మ్యూజియంలో విద్యార్థులకు ప్రయోగాల రూపంలో పాఠాలు బోధించాలని నిర్ణయించారు. ఆరు నుంచి పదవ తరగతి వరకు విద్యార్థుల పాఠ్య పుస్తకాల్లో ఉన్న వందలాది ప్రయోగాల నమూనాలను సిద్ధం చేస్తున్నారు. జిల్లా సైన్సు మ్యూజియంకు వచ్చే విద్యార్థులు స్వయంగా ప్రయోగాలు చేసి అందులోని అంశాలను కనిపెట్టేలా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నారు.



సైన్సు మ్యూజియంలో చేపట్టిన పనులు

సైన్సు మ్యూజియంలో నిర్వహించే కార్యక్రమాలు

- ప్రతి రోజూ రెండు పూటలా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైన్స్ కృత్యాలతో కూడిన తరగతులు నిర్వహిస్తారు.
- యాక్టివిటీ బేస్డ్, ప్రాజెక్ట్ బేస్డ్ కృత్యాలను నేర్పిస్తారు.
- విద్యా సంవత్సరంలో వివిధ పాఠశాలల్లో సైన్స్ ప్రదర్శనలు నిర్వహిస్తారు.
- టీచర్ ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన పెంపొందిస్తారు.
- విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా సైన్స్ సంబంధిత పోటీలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతారు.
- వేసవి, శీతాకాలం సెలవుల్లో విద్యార్థులకు శిక్షణా శిబిరాలు నిర్వహించి ప్రత్యేక శిక్షణ ఇస్తారు.
- విద్యార్థుల్లో సృజనాత్మకతను సమస్య పరిష్కారతత్వాలను పెంపొందించేందుకు డిజైన్ థింకింగ్ కార్యక్రమాలు చేపడతారు.
- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి సైన్స్ పోటీల్లో విద్యార్థులు అర్హత సాధించేందుకు అవసరమైన శిక్షణ ఇస్తారు.
- అగస్త్య ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్న డిజిటల్ మాధ్యమాలను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, సైన్స్‌పై మక్కువ కలిగిన విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.
- సమాజంలో ఉన్న మూఢనమ్మకాలను, అపోహలను పోగొట్టేలా ప్రత్యేక కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నారు.

జిల్లా సమాచారం

జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 560	చదువుతున్న విద్యార్థులు 1,02,552
ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు 260	చదువుతున్న విద్యార్థులు 59,687
మొత్తం ఉన్నత పాఠశాలలు 820	ఉన్నత పాఠశాలల్లో మొత్తం విద్యార్థులు 1,62,239



జిల్లా కేంద్రంలోని సైన్స్ మ్యూజియం



సైన్సు మ్యూజియంలో ప్రయోగాల ఏర్పాటుకు చేస్తున్న పనులు

విద్యార్థులు మక్కువ చూపించేలా



సైన్స్ పట్ల విద్యార్థులు మక్కువ చూపించేలా సైన్స్ మ్యూజియం పనులు నిర్వహిస్తున్నారు. సైన్స్‌తో విద్యాభివృద్ధి సాధ్యపడుతుంది. శాస్త్ర సాంకేతిక ఫలాలు పేద విద్యార్థుల దరికి చేర్చేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయించి మ్యూజియం విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడుతున్నాం.

– సుమిత్ కుమార్ గాంధీ, కలెక్టర్, చిత్తూరు

సైన్స్‌పై భయాన్ని పోగొట్టేందుకు..



విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఉన్న భయాన్ని పోగొట్టేందుకు సైన్స్ మ్యూజియం అభివృద్ధి చేస్తున్నాం. ఆధునీకరణ పనులకు రూ.20 లక్షలను మంజూరు చేశారు. ఆ నిధులతో పనులు వేగవంతంగా చేపడుతున్నాం. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సైన్స్ మ్యూజియంను అభివృద్ధి చేస్తున్నాం.

– వరలక్ష్మి, డీఈఓ, చిత్తూరు

కొత్త ఆలోచనలకు ప్రోత్సాహం



విద్యార్థుల్లో దాగి ఉన్న కొత్త ఆలోచనలకు జిల్లా సైన్సు మ్యూజియం ప్రోత్సాహం ఇస్తుంది. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించేలా ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నాం. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులకు ఉపయోగపడే ప్రధాన ప్రయోగాలను విద్యార్థుల కళ్లకు కట్టేలా మ్యూజియంలో ఏర్పాటు చేస్తున్నాం.

– ఆర్.వెంకటరమణ, జిల్లా సైన్స్ ఆఫీసర్, చిత్తూరు

10న డీఎస్సీ ఉచిత శిక్షణకు స్క్రీనింగ్ పరీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో ఈ నెల 10వ తేదీన డీఎస్సీ ఉచిత శిక్షణకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యంలో అర్హులైన అభ్యర్థులకు డీఎస్సీకి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారని చెప్పారు. ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మొదటగా స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ నెల 10 న జిల్లా కేంద్రానికి సమీపంలో మురకంబట్టు వద్ద ఉన్న సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల, పూతలపట్టు మండలం వేము, గంగవరం మండలం మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలల్లో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఈ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్ష ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉంటుందని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 10 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఈ స్క్రీనింగ్ పరీక్షలో ఎంపికయ్యే అభ్యర్థులకు మూడు నెలల పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యాలతో శిక్షణ ఇస్తారన్నారు. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు www. jnanabhumi. ap.gov.in వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని ఆదేశించారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ఒక ప్రభుత్వ గుర్తింపు కార్డును తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు.

నాణ్యత లేకుంటే కఠిన చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. ఆయన బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారుల తో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పథకంలో 2024–25 సంవత్సరానికి మంజూరు చేసిన అంతర్గత సిమెంట్ కాంక్రీట్ రోడ్ల నిర్మాణంలో నాణ్యతను పరీక్షించాలన్నారు. పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులను సత్వరమే అప్ లోడ్ చేయాలని పంచాయతీ రాజ్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డిని ఆదేశించారు. జిల్లాలో ప్రధానంగా అంతర్గత సిమెంట్ కాంక్రీట్ రోడ్ల కు 2024–25 సంవత్సరానికి గానూ 1503 పనులు మంజూరు చేశామన్నారు. ఇందులో రూ.13 కోట్లతో 248 పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. రూ.8 కోట్లకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేసి రూ.2.50 కోట్లు చెల్లింపులు జరిగాయన్నారు. పూర్తి చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను సత్వరం ఆన్‌లైన్ చేయాలని సూచించారు. సీసీ రోడ్ల నిర్మాణం జరిగే సమయంలో పంచాయతీరాజ్ ఇంజినీర్లు తప్పనిసరిగా పర్యవేక్షించాలన్నారు. విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు. ఐసీడీఎస్ అధికారులతో సమన్వయం చేసుకుని అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. చిత్తూరు నియోజకవర్గంలో రూ.21 లక్షలతో 6 పనులు, జీడీ నెల్లూరు నియోజకవర్గంలో రూ.2.50 కోట్లతో 54, పలమనేరు నియోజకవర్గంలో రూ.2.88 కోట్లతో 62 పనులు, పూతలపట్టు నియోజకవర్గంలో రూ.1 కోటి తో 27 పనులు, కుప్పం లో రూ.4.20 కోట్లతో 62 పనులు, నగరిలో రూ.1 కోటితో 9 పనులు, పుంగనూరులో రూ.91.50 లక్షలతో 28 పనులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఆ పనులు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

మెరుగైన వైద్యం అందించాలి

చికిత్స నిమిత్తం ఆస్పత్రులకు వచ్చే రోగుల చికిత్సలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులను కుంటిసాకులతో మరో ఆస్పత్రికి రెఫరల్ చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్య సేవలను మరింత విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో అవసరమైన పరీక్షల సామర్థ్యాలను పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆస్పత్రుల్లో మెరుగైన పారిశుధ్యం ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి, ఎన్టీఆర్ వైద్యసేవా జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, మెడికల్ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, అపోలో యూనిట్ ఇన్‌చార్జి నరేష్ పాల్గొన్నారు.

స్కంధ షష్ఠి ఉత్సవాల్లో రోజా



స్కంధషష్ఠి ఉత్సవాల్లో వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి : మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం వళ్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో స్కంధ షష్ఠిలో ఐదోరోజు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవళ్లి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామిని పుష్పాలతో సుందరంగా అలంకరించి ఊరేగించారు. ఈ పూజల్లో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజా పాల్గొన్నారు. ఉత్సవ నిర్వాహకులు ఆమెకు ఘనస్వాగతం పలికి పూజలు చేయించారు. వేదపండితులు గజమాల వేసి ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. కౌన్సిలర్ భూపాలన్ ఐదవ రోజు ఉత్సవానికి ఉభయదారుగా వ్యవహరించారు. మాజీ మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, బాబు, గంగాధరం, మోహన్‌రాజ్, మురుగ, రాష్ట్ర మొదలియార్ సంఘం మాజీ డైరెక్టర్ బాలకృష్ణ, కో–ఆప్షన్ సభ్యులు ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

సరుకులు సకాలంలో పంపిణీ చేయాలి



కూలీలతో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

బంగారుపాళెం: పేదలకు పంపిణీ చేసే నిత్యావసర సరకులను గోడౌన్ నుంచి సకాలంలో అందించాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. బంగారుపాళెం మార్కెట్ యార్డు ఆవరణలోని నిత్యావసర సరుకుల గోడౌన్‌ను బుధవారం జేసీ తనిఖీ చేశారు. సరుకుల నాణ్యతను, రికార్డులను పరిశీలించారు. స్టాక్ పాయింట్ నుంచి డీలర్లకు సకాలంలో సరుకులను అందజేసి, వారిద్వారా లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు. కూలీలతో మాట్లాడి వేతనం అందుతోందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించారు. అక్కడ నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించారు. వర్షం వస్తే నీరు హాస్టల్ ఆవరణలో నిలిచిపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సిబ్బంది జేసీ దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో కురిసిన వర్షానికి సమీపంలోని కాలువ పొంగి నీరు హాస్టల్లోకి ప్రవేశించడంతో విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందులను తెలియజేశారు. వర్షపు నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు సూచించారు. హాస్టల్ విద్యార్థుల సంరక్షణపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. బాలికల భద్రతపైన జాగ్రత్త వహించాలన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగం పేరుతో రూ.2.50 లక్షల స్వాహా


మాట్లాడుతున్న తోటి కృష్ణప్ప

పుంగనూరు: మండలంలోని కంగానెల్లూరుకు చెందిన భాస్కర్‌కు యోగా టీచర్ ఉద్యోగం ఇప్పిస్తామంటూ అదే గ్రామానికి చెందిన తెలుగు దేశం నాయకులు రూ.2.50 లక్షలు తీసుకుని మోసం చేశారని బాధితుడి తండ్రి తోటి కృష్ణప్ప ఆరోపించాడు. ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కంగానెల్లూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు యోగా టీచర్ ఉద్యోగం ఇప్పిస్తామని రూ.2.50 లక్షలు తీసుకుని ఉద్యోగం ఇప్పించలేదని, డబ్బులు అడిగినందుకు బెదిరిస్తున్నారని వాపోయాడు. దీనిపై అధికారులు చర్యలు తీసుకుని, తమకు డబ్బులు ఇప్పించాలని కోరారు.

చీలాపల్లె బీపీఓలో తనిఖీలు

చిత్తూరు కార్పొరేషన్: చీలాపల్లె బ్రాంచ్ పోస్టాఫీసులో (బీపీఓ) ఆ శాఖ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గతంలో అకౌంట్స్ పరంగా రూ.45వేలు తక్కువ మొత్తం లెక్క చూపారు. దీనిపై అధికారులు బీపీఓను అడగగా ఆ మొత్తం మళ్లీ చెల్లించారు. ఆ తరువాత బుధవారం ఆకస్మికంగా కార్యాలయానికి వెళ్లి లెక్కలు పరిశీలించారు. పరిశీలన నిమిత్తం ఆశాఖ ఇన్‌స్పెక్టర్ జీవన్ వెళ్లినప్పుడు బీపీఓ సహకారం అందించలేదని తెలుస్తోంది. కార్యాలయానికి సమయానికి రాకపోవడం, అడిగిన వాటికి పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు సమాచారం.

ఏడుగురు ఎంపీటీసీల సస్పెన్షన్

కుప్పం: వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీకి వెళ్లిన రామకుప్పం మండలంలోని ఏడుగురు ఎంపీటీసీ సభ్యులను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ బుధవారం ఎమ్మెల్సీ భరత్ ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్ సీపీ అధికారం కోల్పోవడంతో ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. వీరిని వైఎస్సార్ సీపీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు భరత్ ప్రకటించారు. సస్పెండైన వారిలో విజలాపురం వెంకట్రామ గౌడ్, మద్దునపల్లి బీఎస్ మంజునాథ్, ఉన్సిగానిపల్లి గుర్రప్ప, సింగసముద్రం ఆనంద్, రామకుప్పం తాజ్‌ముల్ భాషా, పంద్యాలమడుగు నాగభూషణం నాయక్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో అత్త, అల్లుడికి గాయాలు

పుంగనూరు: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో అత్త, అల్లుడు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, రామసముద్రం మండలం చిట్టింవారిపల్లెకు చెందిన ఈశ్వరమ్మ, ఆమె అల్లుడు రాజు కలసి ద్విచక్ర వాహనంపై పుంగనూరు మీదుగా మదనపల్లెకు వెళ్లారు. మార్గమధ్యంలోని భీమగానిపల్లి క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో అత్త ఈశ్వరమ్మ, అల్లుడు రాజు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన ఆ ప్రాంత వాసులు 108 వాహనంలో బాధితులను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బాధితులు ఇద్దరినీ మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.వీరి వాహనాన్ని ఢీకొన్న మరో వాహనదారుడి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వరసిద్ధునికే టెండర్

కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే అక్రమార్జనకు శ్రీకారం చుట్టింది. చివరకు గణనాథుడి ఆలయాన్ని వదిలిపెట్టలేదు. అక్కడ సకాలంలో నిర్వహించాల్సిన టెండర్లను వాయిదా వేస్తూ పోతోంది. టెండరుదారులను బెదిరించి, సింగిల్ టెండర్ వేసి తనవాళ్లకు కట్టబెట్టేందుకు కుయుక్తులు పన్నుతోంది. ఆలయ అధికారులందరినీ స్థానిక అధికార పార్టీ నేత గుప్పెట్లో పట్టుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో తన వాళ్లకే టెండర్ దక్కేలా సహకరించాలంటూ హుకుం జారీ చేశారు. దీంతో వరసిద్ధుని క్షేత్రంలో టెండర్ రాజకీయం మొదలైంది.

- కాణిపాకంలో కూటమి రాజకీయం
- టెండర్ల చుట్టూ కత్తి వేలాడదీసిన వైనం
- వాయిదా వేస్తూ అనుచరులకు కట్టబెట్టేందుకు ప్రయత్నం


వాహన పూజలు జరుగుతున్న దృశ్యం (ఫైల్)

కాణిపాకం: కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాగానే మాఫియా రంగంలోకి దిగింది. అన్ని రకాల ఆదాయ వనరులను గుప్పిట్లోకి తెచ్చుకుంటోంది. ఇసుక మొదలు.. మద్యం షాపులు, భూములు.. ఇప్పుడు ఆలయాలపై పెత్తనం చెలాయిస్తోంది. ఈ క్రమంలోనే కాణిపాకంలో సింగిల్ టెండర్ల మాయాజాలంపై గురిపెట్టింది. ఆదిదేవుని సన్నిధిని రాజకీయ అడ్డాగా మార్చేస్తోంది. దీంతో దేవస్థానం చుట్టూ టెండర్ల రాజకీయం అలుముకుంటోంది. వాయిదా వేస్తూ.. అనుకూలమైన వ్యక్తులకు కట్టబెట్టేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఫలితంగా భక్తుల జేబులకు చిల్లు పడుతుండగా, మరోవైపు ఆ డబ్బు ఆలయానికి చేరకుండా రాజకీయ నేతల నోట్లోకి వెళుతోంది. జిల్లాలో కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి క్షేత్రం ప్రసిద్ధి గాంచింది. ఇక్కడకు నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆలయాన్ని అభివృద్ధి పథంలోకి రావడంతో భక్తుల తాకిడి అమాంతంగా పెరిగింది. ఐదేళ్లకు ముందు సాధారణ రోజుల్లో 5 వేల మంది ఉండే భక్తుల సంఖ్య, గత ఐదేళ్లలో ఈ సంఖ్య 10 వేలు దాటింది. శని, ఆదివారాల్లో 25 వేల మందికిపైగా స్వామిని దర్శించుకుంటున్నారు. దీంతో ఆలయ ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. ప్రస్తుత కానుక రూపంలో ధన, ఆభరణ రూపేణా రూ.2 కోట్ల మేర ఆదాయం వస్తోంది. దీంతో పాటు ఇతరత్రా మార్గాల్లో రూ.కోట్లల్లో ఆదాయ వనరులున్నాయి. అప్పటి పాలకులు, పాలకమండలి సభ్యులు సైతం ఆలయ అభివృద్ధికి పాటుపడ్డారు. మరింత అభివృద్ధి చేసేందుకు దాతల సాయం కోరి, విరాళాలు తీసుకొచ్చారు. ఇప్పుడు ఆలయ వృద్ధిని పక్కనపెట్టి, ఆదాయమే పరమావధిగా కూటమి నేతలు భావిస్తున్నారు.

అనుకూలమైతేనే టెండర్లు

గత ప్రభుత్వంలో టెండర్లంటే ఆదాయం కోసం ఎదురుచూశారు. పాట పాడే వారికి అవకాశం ఇచ్చేవారు. ఎంత ఆదాయం వస్తే.. అంతా ఆలయానికి మేలు చేకూర్చేలా టెండర్లు నిర్వహించే వారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నేతలు ఈ టెండర్లపై దృష్టి పెట్టారు. అధికారులను వశం చేసుకుని వారు అనుకున్నది అనుకున్నట్లు చేస్తున్నారు. ప్రస్తుతం టెండర్ల చుట్టూ రాజకీయం చేస్తున్నారు. సింగిల్ టెండర్ల విధానాన్ని అవలంబిస్తున్నారు. అనుకూలమైన వ్యక్తులకు తప్ప మిగిలిన వాళ్లను టెండర్ వేయనివ్వడం లేదు. ఒకవేళ టెండర్ వేసేందుకు ముందుకు వచ్చినా.. వారిని బెదిరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఒక టెండర్‌కు 20 వరకు దరఖాస్తులు వస్తే, ఇప్పుడు ఎందుకు ఒకటి చొప్పున టెండర్ వస్తోందని భక్తులు, కాణిపాకంలోని పలు దుకాణదారులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఇక సెక్యూరిటీల కాలపరిమితి ఉన్నప్పటికీ, వారి స్థానంలో కొత్త వారిని నియమించుకున్నారని కాణిపాకం వాసులు ఛీ కొడుతున్నారు.

> **త్వరలో పిలుస్తాం..**
> “ టెండర్లు త్వరలో పిలుస్తాం. గతంలో పిలిచాం. కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడ్డాయి. పారదర్శంగానే టెండర్లు జరుగుతాయి. ఆసక్తి ఉన్న వారు ఎవరైనా పాల్గొనవచ్చు. ఇందులో ఎలాంటి రాజకీయం లేదు.
> – గురుప్రసాద్, ఈఓ, కాణిపాకం

వీటి చుట్టే.. టెండర్ల రాజకీయం!

కాణిపాకంలో 40 షాపులతో పాటు పదుల సంఖ్యలో క్యాంటీన్లు ఉన్నాయి. దీంతో పాటు వాహన పూజసామగ్రి, పాదచారుల కౌంటర్, నేతిదీపాల అమ్మకాలు, కొబ్బరి చిప్పల సేకరణ, కోనేరు తదితర వాటికి ఏటా టెండర్లు పిలుస్తుంటారు. వీటి ద్వారా రూ.3 కోట్ల మేర ఆదాయం వస్తోంది. అయితే ఈ ఆదాయానికి ప్రస్తుతం గండి పడుతోందని దుకాణాదారులు, భక్తులు భగ్గుమంటున్నారు. ఇప్పటికే కొన్నింటిపై రెండుసార్లు టెండర్లు పిలిచి వాయిదా వేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బ్రహ్మోత్సవాల నుంచి టెండర్ల ప్రక్రియ వరకు ఓ ప్రజాప్రతినిధి ఇక్కడ చక్రం తిప్పుతున్నారు. తాను అనుకున్నదే జరగాలని ఆయన భీష్మించి కూర్చున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీన్ని స్థానిక కూటమి నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సోమవారం జరిగిన పాదచారుల కౌంటర్ వేలం సింగిల్ టెండర్‌తోనే ముగిసింది. ఈ టెండర్‌కు పోటీ లేకపోవడంతో గతంలో కంటే తక్కువకు టెండర్ దక్కించుకున్నట్లు అక్కడి వ్యాపారులు వాపోతున్నారు. ఈ టెండర్‌ను పక్కన ఉంచితే, ఇప్పుడు అందరి కన్ను వాహన పూజ సామగ్రి అమ్మకాలపై పడింది. దీనికి టెండర్లు ఎప్పుడెప్పుడా అంటూ పలువురు ఎదురుచూస్తున్నారు. అయితే ఈ టెండర్‌కు సైతం పోటీ లేకుండా సింగిల్‌గానే ముగించేందుకు ఆ ప్రజాప్రతినిధి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం జరుగుతున్న పూజసామగ్రి అమ్మకాలను కూటమి నేతకు చెందిన వ్యక్తికే అంటగట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అర్ధగిరి క్షేత్రానికి రూ.11.11 లక్షల ఆదాయం


అర్ధగిరి క్షేత్రంలో హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానానికి రూ.11.11 లక్షలు హుండీ ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ హనుమంతురావు తెలిపారు. ఆలయ మండపంలో బుధవారం ఆగస్టు నెల నుంచి నవంబరు నెల 6వ తేదీ వరకు వచ్చిన హుండీ కానుకలను లెక్కించినట్లు పేర్కొన్నారు. ఇందులో రూ.11,11,788 ఆదాయం వచ్చిందని వివరించారు. హుండీ లెక్కింపులో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ జి.రామప్రసాద్ రెడ్డి, అరగొండ సప్తగిరి గ్రామీణ అధికారి సాయిలోచన రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భర్త ఆచూకీ కోసం భార్య ఫిర్యాదు

రామకుప్పం: మండలంలోని పెద్దగానూరుకు చెందిన అమృత తన భర్త మంజునాథ్ రెడ్డి సోమవారం రాత్రి నుంచి కనబడడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనను కులాంతర వివాహం చేసుకున్న తన భర్త మంజునాథ్ రెడ్డికి వారి కుటుంబ సభ్యుల నుంచి బెదిరింపులు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. సోమవారం రాత్రి తన బావ పుట్టినరోజు వేడుకలకు వెళ్లిన మంజునాథ్ రెడ్డి తిరిగి ఇంటికి రాలేదని తన భర్త ఆచూకీ తెలపాలని పోలీసులను కోరింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట మోహన్ తెలిపారు.

కుర్చీ కోసం టీడీపీ కుట్ర

కుర్చీ కోసం టీడీపీ కుట్రలు చేస్తోంది. ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులను నానారకాలుగా వేధిస్తోంది. మరి కొందరిని ప్రలోభ పెడుతోంది. మొత్తంగా ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్ కుర్చీలను లాక్కోవడానికి తీవ్రంగా ప్రయత్నించి, ఎట్టకేలకు ఫలితం సాధించింది. ప్రజలు ఒక పార్టీకి ఓట్లేసి గెలిపిస్తే, గెలిచిన వారందరినీ తమ పార్టీలోకి లాక్కొని ప్రజాతీర్పును అపహాస్యం చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే ఇలాంటి కుట్రలు, కుతంత్రాలు చేయడం గమనార్హం.

- వేధింపులు, ప్రలోభాలతో పార్టీ ఫిరాయింపులు
- వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులే లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్
- ఎంపీపీ, మున్సిపల్ కుర్చీల కోసం అధికార పార్టీ అడ్డదారులు



శాంతిపురం: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత కుప్పం నియోజకవర్గంలో స్థానిక సంస్థలపై ఆ పార్టీ ఆధిపత్యం కొనసాగుతూ వచ్చింది. కానీ 2021లో జరిగిన మండల, జిల్లా పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ గుత్తాధిపత్యానికి భారీగా గండి పడింది. నియోజకవర్గంలోని నాలుగు ఎంపీపీ, నాలుగు జెడ్పీటీసీ, ఒక్క మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని వైఎస్సార్‌సీపీకి అప్పగిస్తూ ఓటర్లు తీర్పు ఇచ్చారు. కానీ 2024 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో జనం ఇచ్చిన తీర్పు అభాసుపాలు కావడం ఆరంభమైంది. వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులను అడుగడుగునా ఇబ్బందులకు గురిచేస్తున్న అధికార పార్టీ, కొందరిని ప్రలోభ పెడుతూ తమ గూటికి చేర్చుకోవటం మొదలు పెట్టింది. తమ మాట వినని ప్రజాప్రతినిధులను వేధిస్తూ, వారి కనీస విధులు–బాధ్యతలు కూడా వారు నెరవేర్చలేని పరిస్థితి తెచ్చింది. అడ్డదారిలో ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని వశం చేసుకునే ప్రయత్నంలో ప్రజల అభిప్రాయాన్ని, ఓటర్ల తీర్పును అభాసుపాలు చేస్తోంది. దశల వారీగా ఎంపీటీసీలు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు పసుపు కండువాలు కప్పడం మొదలు పెట్టింది. దీని కోసం అధికార యంత్రాంగాన్ని, ముఖ్యంగా పోలీసులను వినియోగించుకుంది. స్థానిక సంస్థలన్నీ అధికార పార్టీ గుప్పెట్లోనే ఉండాలనే సంప్రదాయానికి టీడీపీ తెరతీసింది.

ఎంపీపీ కుర్చీపై గురి

రామకుప్పం మండలంలో మొత్తం 16 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 2021లో జరిగిన ఎన్నికల్లో వాటన్నింటినీ వైఎస్సార్‌సీపీ కైవశం చేసుకుని ఎంపీపీ కుర్చీని సొంతం చేసుకుంది. మణీంద్రం నుంచి ఎంపీటీసీగా గెలుపొంది ఎంపీపీ అయిన శాంతకుమారి మృతి చెందడంతో ఆ పార్టీ బలం 15కు తగ్గింది. అందులో ఏడుగురు ఎంపీటీసీలు సోమవారం టీడీపీలో చేరారు. దీంతో ఎంపీపీ పదవిని చేజిక్కించుకోవటానికి టీడీపీ ఎత్తులు వేస్తోంది. మరో వైపు మిగతా మండలాల్లోనూ ఎంపీటీసీలు, సర్పంచులకు పచ్చ కండువా కప్పిన అధికార నాయకులు తమ ప్రయత్నాలను ముమ్మరంగా కొనసాగిస్తూనే ఉన్నారు. ఓటర్ల తీర్పుకు విలువ లేకుండా ఆడుతున్న ఈ వికృత రాజకీయ క్రీడపై స్థానికంగా ప్రజల్లో విస్తృత చర్చ సాగుతోంది.

మున్సిపాలిటీపై పచ్చ పంజా

కుప్పం మున్సిపాలిటీ ఏర్పాటు తర్వాత తొలిసారిగా 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికలను టీడీపీ, వైఎస్సార్‌సీపీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని తలపడ్డాయి. మొత్తం 25 వార్డులు ఉండగా ఆరింట మాత్రమే టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. మిగతా 19 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కౌన్సిలర్లుగా గెలుపొందారు. 16వ వార్డు నుంచి గెలుపొందిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ డాక్టర్ సుధీర్ మున్సిపల్ చైర్మన్ అయ్యారు. 2024 తర్వాత మారిన పరిస్థితుల్లో దశల వారీగా 8 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు పసుపు కండువా కప్పుకున్నారు. తాజాగా మున్సిపల్ చైర్మన్ తన పదవులకు రాజీనామా చేసి టీడీపీలో చేరారు. దీంతో ఇక మున్సిపల్ కుర్చీ టీడీపీ వశం కావటం లాంఛనంగా మారింది.

ఇళ్ల స్థలాల ఆక్రమణలపై ఆందోళన


తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించిన బాధిత కుటుంబాలు

పుంగనూరు: పట్టణ సమీపంలోని నక్కబండ ప్రాంతంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను వీఆర్‌ఏ వెంకటముని, అతని కుటుంబసభ్యులు ఆక్రమించుకున్నారని బాధిత కుటుంబాలు ధర్నాకు దిగాయి. బాధితులందరూ బుధవారం మండల కార్యాలయం ఎదుట బైఠాయించి తమ నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను వీఆర్‌ఏ వెంకటముని, అతని కుటుంబం విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. స్థలాల ఆక్రమణపై ప్రశ్నిస్తే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ రాము మాట్లాడుతూ వీటిపై విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామని బాధితులకు హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు.


ఫెన్సింగ్ పోటీలకు ఐరాల విద్యార్థులు

ఐరాల: రాష్ట్ర స్థాయి అండర్–19 ఫెన్సింగ్ పోటీలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం విజయలక్ష్మి తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ చిత్తూరు మెసానికల్ క్రీడా మైదానంలో అక్టోబర్ 30న నిర్వహించిన జిల్లా స్థాయి అండర్–19 ఫెన్సింగ్ పోటీల్లో బాల, బాలికలు విశేష ప్రతిభ కనబరిచారన్నారు. దీంతో బాలుర విభాగంలో లోకేష్, గణేష్, తులసి, గిరీష్, దినేష్ రెడ్డి, బాలికల విభాగంలో పావని, మొగిలీశ్వరి, మైథిలి, ఆసియా ఎంపికయ్యారని వివరించారు. వీరందరూ నంద్యాలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

పశువులకు మెరుగైన వైద్యం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పశువులకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్ అన్నారు. చిత్తూరు నగరంలోని ఆ శాఖ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పశుగణన సర్వే పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. లెక్కలు పక్కాగా ఉండాలన్నారు. దీని ఆధారంగానే పశువులకు సంబంధించిన పథకాలు వస్తాయన్నారు. మినీ గోకులం షెడ్ల నిర్మాణ పనులను పారదర్శకంగా జరిగేలా చూడాలని చెప్పారు.

కంటైనర్ల ఢీ: ఒకరికి తీవ్ర గాయాలు


ధ్వంసమైన కంటైనర్

గంగవరం: ముందు వెళుతున్న కంటైనర్ లారీని, మరో కంటైనర్ వెనకనుంచి ఢీకొన్న సంఘటన మండలంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ ప్రసాద్ కథనం మేరకు, బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కంటైనర్ వైఎస్సార్ జంక్షన్ వద్ద గంగవరం బైపాస్ రోడ్డుపై ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద హఠాత్తుగా బ్రేక్ వేసింది. దీంతో వెనక వస్తున్న మరో కంటైనర్ అదే వేగంతో వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటనలో వెనుక ఢీకొన్న కంటైనర్ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. డ్రైవర్ రమేష్ బందారికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, గంగవరం సీఐ ప్రసాద్, పలమనేరు సీఐ నరసింహరాజు కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాయపడిన డ్రైవర్‌ను చిత్తూరుకు తరలించారు. ధ్వంసమైన కంటైనర్‌ను జేసీబీ ద్వారా రోడ్డుపై నుంచి తొలగించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

14 రోజుల పాటు నిరసనలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలోని 104 ఉద్యోగులు 14 రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు బుధవారం వారు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవికి విన్నవించారు. జీఓ ప్రకారం జీతాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత, వేతన పెంపు, ఇతరత్రా సమస్యలపై నిరసన చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో 14 రోజులపాటు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు: నిత్యం ఎక్కువ సమయం సెల్‌ఫోన్ చూస్తున్న కుమార్తెను తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై కుమార్తె ఆత్మహత్యకు యత్నించిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. చౌడేపల్లె మండలం బూరగపల్లికి చెందిన వెంకట్రమణారెడ్డి కుమార్తె జానకి(19) తరచుగా సెల్‌ఫోన్‌లో మాట్లాడటం, సెల్‌ఫోన్ చూస్తుండడంతో తండ్రి మందలించాడు. దీనిపై మనస్తాపానికి గురైన జానకి ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కుప్పం: కర్ణాటక మద్యం సీజ్ చేసి ముగ్గురిని అరెస్టు చేసిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ నాగరాజ్ కథనం మేరకు, గుడుపల్లె మండలం మిట్టూరుకు చెందిన నాగరాజు, వన్ కొత్తూరుకు చెందిన శ్రీనివాసులు, రామకుప్పం మండలం సింగసముద్రం గ్రామానికి చెందిన నారాయణప్ప వద్ద విక్రయానికి సిద్ధంగా ఉన్న 114 కర్ణాటక మద్యం సీసాలు పట్టుకున్నారు. ఆ బాటిళ్లను సీజ్ చేసి, ముగ్గురిని అరెస్టు చేశారు.

హంతకుడికి కఠిన శిక్ష పడేలా చూస్తాం


సరుకులు అందిస్తున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్

విజయపురం (వడమాలపేట): మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి చేసి హత్య చేసిన నిందితునికి కఠిన శిక్ష పడేలా చేస్తానని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని ఏఎం పురం ఎస్టీ కాలనీలో ఇటీవల హత్యకు గురైన చిన్నారి తల్లిదండ్రులను బుధవారం ఆయన పరామర్శించారు. నెలకు సరిపడే నిత్యావసర సరుకులను అందజేశారు. బతుకు దెరువు కోసం ఉద్యోగ అవకాశం కల్పించాలని, తమ సొంత మండలం కేవీబీ పురంలో ఇంటి స్థలంతోపాటు ఇల్లు కట్టించాలని బాధితులు ఆయన్ను కోరారు. ఆయన స్పందిస్తూ జిల్లా కలెక్టర్‌కు పూర్తి స్థాయిలో నివేదిక పంపి తొందరలోనే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ రవి కుమార్, ఎస్‌ఐ ధర్మా రెడ్డి, ఎంపీడీఓ శేషగిరి రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని హాకీ క్రీడాకారుడి దుర్మరణం


తులసీబాబు(ఫైల్)

ఎందరో యువకుల్ని క్రీడాకారులుగా తీర్చిదిద్దాడు. హాకీ కర్ర చేతిలో పట్టుకుంటే గోల్ కొట్టాల్సిందే అన్నట్టు ఉత్సాహాన్ని నింపాడు. చిత్తూరు యువకుల్ని రాష్ట్ర స్థాయిలో మెరిపించి, గుర్తింపు తీసుకొచ్చాడు. పిన్న వయసులోనే ఓ క్రీడాకారుడిగా, కోచ్‌గా రాణించి.. చివరకు అదే వృత్తిలో స్థిరపడి, పాఠశాలలో పిల్లలకు దిక్సూచిగా మారుదామని కలలు గన్న యువకుడు రోడ్డు ప్రమాదంలో శాశ్వతంగా కన్నుమూశాడు.

చిత్తూరు అర్బన్: వాహనం ఢీకొన్న సంఘటనలో హాకీ క్రీడాకారుడు దుర్మరణం పాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు కథనం మేరకు.. నగరంలోని మురకంబట్టు ఎస్‌ఆర్‌ఎం వీధికి చెందిన తులసీబాబు(26) హాకీ క్రీడాకారుడు. ఉదయం 4 గంటల సమయంలో తన స్నేహితుడితో కలిసి మురకంబట్టు వద్ద వాకింగ్‌కు వెళ్లి వస్తుండగా, గుర్తు తెలియని వాహనం తులసీబాబును వెనుక నుంచి ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే స్థానికులు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఇక్కడే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఢీకొట్టిన వాహనం లగేజీ ఆటోగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

వెండి పతకం సాధించి...

హాకీ క్రీడాకారుడైన తులసీబాబు అండర్–19 జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇటీవల నెల్లూరులో జరిగిన అండర్–19 రాష్ట్ర హాకీ పోటీలకు చిత్తూరు నుంచి క్రీడాకారులను తీసుకెళ్లారు. అక్కడ క్రీడాకారులకు తగిన సూచనలు, సలహాలివ్వడంతో వారు సత్తా చాటారు. ఫలితంగా ఆ పోటీల్లో వెండి పతకం సాధించుకొచ్చారు. ప్రస్తుతం ఓ పాఠశాలలో పీఈటీగా పనిచేస్తూ డీఎస్సీకి సన్నద్ధమవుతున్నాడు. ఇంతలో మృత్యువు కబళించింది.